RNI NO:APTEL/2018/76747

# నవతరం


తెలుగు దిన పత్రిక

NAVATARAM TELUGU DAILY

ఎడిటర్ : శిరిగిరి వరదరాజు

పబ్లిషింగ్ : రాజమహేంద్రవరం | సంపుటి : 11 | సంచిక : 359 | AP/TEL/2018/76747 | బుధవారం 11 - 02 - 2026 | పేజీలు : 04 | వెల : 01 రూ..

Published From: Srikakulam, Parvathipuram Manyam,Vizianagaram,Visakhapatnam,Alluri Sitharama Raju,Anakapalli,Kakinada,East Godavari ,Konaseema,Eluru,West Godavari,NTR,Krishna,Guntur,Bapatla,Nellore,Prakasam,Kurnool,Nandyal,Sri Sathya Sai,YSR,Annamayya,Tirupati,Chittoor



# మరో వందేభారత్

## కేంద్రాన్ని కోరిన సీఎం చంద్రబాబు

- ఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం చంద్రబాబు భేటీ
- ఏపీ రైల్వే ప్రాజెక్టులపై సమగ్ర వినతిపత్రం అందజేత
- బెంగళూరు-చెన్నై హైస్పీడ్ రైలును తిరుపతితో కలపాలని విజ్ఞప్తి
- దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను ఏప్రిల్ 1 నుంచి ప్రారంభించాలని కోరిక
- విజయవాడ-బెంగళూరు మధ్య తిరుపతి మీదుగా వందేభారత్ ఏర్పాటుకు వినతి

మిగతా 2 లో...



# నెత్తిపై అప్పుల మోత

## టాప్‌లో ఏపీ, 5వ స్థానంలో తెలంగాణ

- తెలుగు రాష్ట్రాల్లో ఉన్న రైతుల నెత్తిపై అప్పుల కుప్ప
- పార్లమెంటు వేదికగా కేంద్రం వెల్లడించింది
- అప్పులు ఉన్న రాష్ట్రాల జాబితాలో ఏపీ తొలి స్థానం
- తెలంగాణ ఐదో స్థానంలో నిలిచింది



మిగతా 2 లో..

తెలంగాణ, నవతరం

తెలుగు రాష్ట్రాల్లో ఉన్న రైతుల నెత్తిపై అప్పుల కుప్ప ఉన్నట్లు పార్లమెంటు వేదికగా కేంద్రం వెల్లడించింది. దేశంలోనే రైతులపై అప్పులు ఉన్న రాష్ట్రాల జాబితాలో ఏపీ తొలి స్థానంలో నిలిచింది. ఇక ఈ లిస్ట్‌లో తెలంగాణ ఐదో స్థానంలో నిలిచింది. ఏపీలో ఒక్కో రైతుపై సగటున రూ.2.35 లక్షల అప్పు ఉండగా.. అదే తెలంగాణ రైతులపై సగటున రూ.1.52 లక్షలు ఉన్నట్లు వెల్లడించింది. దేశానికి అన్నం పెట్టేది రైతు. దేశ అభివృద్ధికి తోడుగా ఉండేది వ్యవసాయ రంగం. ఇక మన భారతదేశంలో 60 శాతానికి పైగా వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కానీ రైతులు మాత్రం మన దేశంలో నానాటికీ అప్పుల ఊబిలో కూరుకుపోతునే ఉన్నారు. రైతును రాజుగా చేయాలని అటు కేంద్ర ప్రభుత్వం.. ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు..

మిగతాది 2 లో...

# "హలో ఇండియా"

- శ్రీశైలంలో శివభక్తులపై లాఠీచార్జ్ చేశారన్న జగన్
- ఆలయాల నిర్వహణలో టీడీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శ
- తిరుపతి, సింహాచలం ఘటనలను ప్రస్తావించిన వైసీపీ అధినేత
- ప్రచారానికే తప్ప ప్రభుత్వానికి బాధ్యత లేదని ఆరోపణ
- చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎందుకు మౌనంగా ఉన్నారంటూ ప్రశ్నించిన జగన్

ఆంధ్రప్రదేశ్, నవతరం

శ్రీశైలంలో శివమాల ధరించిన భక్తులపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారంటూ వైసీపీ అధినేత, ప్రతిపక్ష నాయకుడు జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వ పాలనలో ఆలయాలకు వెళ్లే భక్తులకు భద్రత కరువైందని, భక్తితో యాత్రలు

మిగతాది 2 లో...




# అవిశ్వాసం తేలేదాకా కుర్చీ ఎక్కను

- లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాకు వ్యతిరేకంగా విపక్షాల అవిశ్వాస తీర్మానం నోటీసు
- ఈ విషయం తేలేదాకా విధులకు దూరంగా ఉంటానన్న ఓం బిర్లా
- ఇది తన నైతిక బాధ్యత అని, చర్చ జరగాల్సిందేనని స్పష్టం చేసిన స్పీకర్
- మార్చి 9న అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగే అవకాశం

జాతీయం, నవతరం:

లోక్‌సభలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. తనపై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగి, పరిష్కారం లభించేంత వరకు స్పీకర్ స్థానంలో కూర్చోకూడదని ఓం బిర్లా సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇది తన

మిగతాది 2 లో...



# వ్యవసాయాన్ని మరో స్థాయికి తీసుకెళతాం

- కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్‌తో సీఎం చంద్రబాబు భేటీ
- వ్యవసాయాన్ని మరో స్థాయికి తీసుకెళ్లేందుకు సలహాలు కోరానన్న సీఎం
- దేశ వ్యవసాయ జీడీపీలో ఏపీ వాటా దాదాపు 10 శాతం అని వెల్లడి
- ఏపీ అవసరాలకు అనుగుణంగా యాక్షన్ ప్లాన్ రూపొందించాలని కేంద్రమంత్రి
- చంద్రబాబు నాయకత్వంలో ఏపీ హార్టికల్చర్ హబ్‌గా మారిందన్న శివరాజ్ సింగ్



2

ఆంధ్రప్రదేశ్, నవతరం

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగాన్ని మరో ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కేంద్రం మార్గనిర్దేశం చేయాలని కోరినట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఢిల్లీ

# ప్రజలను అవమానించడమే

- వైసీపీ ఎమ్మెల్యేలపై ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు తీవ్ర విమర్శలు
- చర్చలకు బదులు అరాచకానికే వైసీపీ అలవాటుపడిందని వ్యాఖ్య
- 151 నుంచి 11 సీట్లకు పడిపోవడమే వైసీపీ పాలనకు నిదర్శనం
- 22-ఏను అడ్డుపెట్టుకుని రైతులను వైసీపీ ప్రభుత్వం వేధించిందన్న కాల్వ



మిగతాది 2 లో...

ఆంధ్రప్రదేశ్, నవతరం

శాసనసభ చర్చలకు దూరంగా ఉండటం అంటే ప్రజలు ఇచ్చిన అధికారాన్ని అవమానించడమేనని ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు వైసీపీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బుధవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. శాసనసభ్యులుగా

# ఈ అబద్ధపు ప్రచారం

- చంద్రబాబు ప్రభుత్వం జీఎస్‌డీపీపై తప్పుడు లెక్కలు చెబుతోందని జగన్ ఆరోపణ
- 11.75 శాతం వృద్ధి అంటూ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని విమర్శ
- 'కాగ్' లెక్కల ప్రకారం రాష్ట్ర పన్నుల రాబడి వృద్ధి కేవలం 1.97 శాతం మాత్రమేనని వెల్లడి
- పన్నుల వసూళ్ల వృద్ధిలో 23 రాష్ట్రాల్లో ఏపీకి 22వ స్థానం లభించిందని ఎద్దేవా
- అప్పులు, అవినీతి, కక్ష సాధింపుల్లోనే ఏపీ ప్రథమ స్థానంలో ఉందని తీవ్ర విమర్శ

ఆంధ్రప్రదేశ్

వైసీపీ అధినేత జగన్ కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వం మాత్రం తప్పుడు జీఎస్‌డీపీ (స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి) గణాంకాలతో ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందనే భ్రమ కల్పించేందుకే

# అవిశ్వాసం తేలేదాకా కుర్చీ ఎక్కను



నైతిక బాధ్యత అని, స్పీకర్ స్థానంపై సందేహాలు వ్యక్తమైనప్పుడు తక్షణం చర్చ జరగాలనే సందేశం ఇవ్వడానికే ఓం బిర్లా ఈ నిర్ణయం తీసుకున్నట్లు లోక్‌సభ సచివాలయ వర్గాలు వెల్లడించాయి. మంగళవారం నాడు కాంగ్రెస్ పార్టీ సహా ఇతర విపక్షాలు ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చాయి. స్పీకర్ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని, ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని, ఇటీవల 8 మంది ఎంపీలను సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 94(ఎ) కింద ఈ నోటీసును సమర్పించాయి. దీనిపై సుమారు 120 మంది విపక్ష ఎంపీలు సంతకాలు చేశారు. ఈ నేపథ్యంలోనే ఓం బిర్లా ఈ నిర్ణయం తీసుకున్నారు. తన అభిప్రాయాన్ని మంగళవారం వివిధ పార్టీల నేతలకు, ప్రతిపక్ష నాయకులకు కూడా తెలియజేశారు. ప్రభుత్వం గానీ, ప్రతిపక్షాలు గానీ కోరినా తాను తన నిర్ణయాన్ని మార్చుకోబోనని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ అవిశ్వాస తీర్మానంపై చర్చ బడ్జెట్ సమావేశాల రెండో భాగం తొలి రోజైన మార్చి 9న జరిగే అవకాశం ఉంది. అప్పటివరకు ఓం బిర్లా స్పీకర్ సీటుకు దూరంగా ఉండనున్నారు. పార్లమెంటరీ చరిత్రలో స్పీకర్‌పై పెట్టిన అవిశ్వాసం ఎప్పుడూ నెగ్గనప్పటికీ, తాజా పరిణామంతో బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరగడం ఖాయంగా కనిపిస్తోంది.

# ఈ అబద్ధపు ప్రచారం

ఈ అబద్ధపు ప్రచారం చేస్తున్నారని జగన్ దుయ్యబట్టారు. ప్రభుత్వం విడుదల చేసిన వివరాల ప్రకారం, 2024–25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 11.75 శాతం వృద్ధి సాధించిందని, 2025–26లో ఇది 10.75 శాతంగా ఉంటుందని అంచనా వేస్తున్నట్లు పేర్కొనడాన్ని జగన్ తప్పుబట్టారు. ఈ వృద్ధి రేటుతో దేశంలోనే మూడో స్థానంలో ఉన్నామని ప్రభుత్వం చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. ఈ లెక్కలు ఏ స్వతంత్ర సంస్థ ఇచ్చినవి కావని, కేవలం చంద్రబాబు కార్యాలయంలో సృష్టించినవని ఆయన విమర్శించారు. ప్రభుత్వం చెబుతున్న వృద్ధి నిజమైతే, పన్నుల రాబడిలో కూడా అదే స్థాయి పెరుగుదల కనిపించాలని జగన్ అన్నారు. కానీ, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 9 నెలలకు విడుదల చేసిన లెక్కలు ప్రభుత్వ బూటకపు ప్రచారాన్ని బట్టబయలు చేశాయని తెలిపారు. గత రెండేళ్లలో రాష్ట్ర పన్నుల రాబడి వృద్ధి సగటున కేవలం 1.97 శాతంగా మాత్రమే ఉందని, ఇది దిగ్భ్రాంతికరమని అన్నారు. "11 శాతం పైగా జీఎస్‌డీపీ వృద్ధి సాధిస్తున్న రాష్ట్రంలో పన్నుల రాబడి 2 శాతం లోపు ఎలా ఉంటుంది? ఈ వింత గణాంకాలు చూసి ప్రపంచ ఆర్థికవేత్తలు కూడా ఆశ్చర్యపోతారు" అని జగన్ ఎద్దేవా చేశారు. ఇదే సమయంలో, దేశంలోని 23 రాష్ట్రాలకు సంబంధించిన పన్నుల రాబడి వృద్ధిపై 'కాగ్' విడుదల చేసిన గణాంకాలను జగన్ ప్రస్తావించారు. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్ అట్టడుగు నుంచి రెండో స్థానంలో, అంటే 22వ ర్యాంక్‌లో నిలవడం సిగ్గుచేటని అన్నారు. ఇదే చంద్రబాబు '22వ ర్యాంక్ విజన్' అంటూ ఆయన సెటైర్లు వేశారు. చంద్రబాబు నాయకత్వంలో ఏపీ ఏదైనా విషయంలో మొదటి స్థానంలో ఉందంటే అది అప్పులు, అవినీతి, రాజకీయ కక్ష సాధింపులు, తప్పుడు ప్రచారంలో మాత్రమేనని జగన్ తీవ్రంగా విమర్శించారు.

# ప్రజలను అవమానించడమే



తమ ప్రాథమిక బాధ్యతలను వైసీపీ నేతలు పూర్తిగా విస్మరించారని ఆయన ఆరోపించారు. గత నాలుగు సమావేశాలకు డుమ్మా కొట్టిన వైసీపీ, చర్చల స్థానంలో అరాచక ప్రవర్తనకే అలవాటు పడిందని కాల్వ విమర్శించారు. గవర్నర్ ప్రసంగం రోజు మొక్కుబడిగా సభకు వచ్చి, కాగితాలు చించి గందరగోళం సృష్టించడం తప్ప ప్రజా సమస్యలపై మాట్లాడింది లేదని దుయ్యబట్టారు. ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనను చూసిన ప్రజలు, కూటమికి 164 స్థానాలిచ్చి చారిత్రక తీర్పు ఇచ్చారని గుర్తుచేశారు. 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయినప్పటికీ వైసీపీ తన తీరు మార్చుకోకపోవడం దారుణమన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 22–ఏ నిబంధనను ఒక ఆయుధంగా మార్చి రైతులను, సామాన్యులను తీవ్రంగా ఇబ్బంది పెట్టారని కాల్వ శ్రీనివాసులు ఆరోపించారు. తమ అవినీతి, భూకబ్జాలపై సభలో సమాధానం చెప్పలేకనే జగన్ మోహన్ రెడ్డి అసెంబ్లీకి ముఖం చాటేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఏ అంశంపైనైనా చర్చకు సిద్ధంగా ఉందని, నిర్మాణాత్మక విమర్శలను స్వాగతిస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా వైసీపీ ఎమ్మెల్యేలు తమ బాధ్యతను గుర్తించి, బడ్జెట్ సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలపై గళం విప్పాలని కాల్వ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.

## నెత్తిపై అప్పుల మోత

అన్నదాతలకు ఎన్నో రాయితీలు, పథకాలు, ఆర్థిక సహాయాలు అందిస్తున్నప్పటికీ.. రైతులు మాత్రం లాభాల్లోకి రాలేకపోతున్నారు. లాభాల సంగతి పక్కన పెడితే.. వారి నెత్తిపై రోజురోజుకూ అప్పుల కుప్ప కొండలా పేరుకుపోతోంది. ఈ నేపథ్యంలోనే దేశంలో రాష్ట్రాల వారిగా రైతులపై ఉన్న అప్పులకు సంబంధించి.. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్.. మంగళవారం లోక్‌సభ వేదికగా కీలక ప్రకటన చేశారు. రైతులు అత్యధిక అప్పులు తీసుకున్న రాష్ట్రాల జాబితాను కేంద్రమంత్రి వెల్లడించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉండగా.. తెలంగాణ ఐదో స్థానంలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ లెక్కన దేశంలోనే అధిక అప్పుల భారం ఆంధ్రప్రదేశ్ అన్నదాతలపైనే ఉన్నట్లు స్పష్టం చేశారు. 2018 జూలై నుంచి 2019 జూన్ మధ్య ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న రైతుల సగటు అప్పు విలువ రూ.2,35,554 ఉన్నట్లు కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడించారు. అదే సమయంలో తెలంగాణ రైతుల సగటు అప్పు రూ.1,52,113 ఉన్నట్లు తేల్చి చెప్పారు. అదే సమయంలో దేశవ్యాప్తంగా రైతుల సగటు అప్పుల భారం రూ.74,121 ఉన్నట్లు కేంద్రమంత్రి లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. ఇదిలా ఉంటే.. దేశఆర్థిక వ్యవస్థకు మూలం గ్రామీణ, వ్యవసాయ రంగాలే. 1991 తర్వాత చేపడుతున్న ఆర్థిక సంస్కరణలు ఇండియాను ప్రపంచంలోనే ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మలిచినా, వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతుండటంతో దేశంలో ఉపాధి అవకాశాలు మెరుగు పడటం లేదు. మరోవైపు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. రుణమాఫీ, మీరా వంటి ఉపశమన చర్యలు సమస్య మూల కారణాలను పరిష్కరించలేకపోతున్నాయి.

# "హలో ఇండియా"



చేసేవారు నేడు భయంతో ఆలయాలకు వెళ్లాల్సిన దారుణ పరిస్థితులు నెలకొన్నాయని ఆయన విమర్శించారు. ప్రభుత్వ ఘోర వైఫల్యాల వల్లే పవిత్ర పుణ్యక్షేత్రాల్లో ఇలాంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం అవుతున్నాయని మండిపడ్డారు. ఈ మేరకు "హలో ఇండియా" అంటూ ట్వీట్ చేశారు. "శ్రీశైలం ఆలయంలో శివమాల ధరించిన భక్తులపై పోలీసుల లాఠీఛార్జ్ ప్రభుత్వ యంత్రాంగ వైఫల్యానికి పరాకాష్ఠ. ఏటా మహాశివరాత్రికి పాదయాత్రగా వచ్చే భక్తుల సౌకర్యార్థం ఇచ్చే సమయాన్ని ఏడు రోజులకు కుదించారు. దీనివల్ల భక్తులు భారీగా తరలివస్తారని తెలిసినా, అధికారులు కనీస ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారు. తాగునీరు, క్యూలైన్ల నిర్వహణ, వైద్య సదుపాయాలు వంటి మౌలిక వసతులు కల్పించకపోవడంతో గంటల తరబడి పిల్లాపాపలతో భక్తులు నరకయాతన అనుభవించారు" అని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ భక్తులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో, పోలీసులు వారిపై విచక్షణారహితంగా లాఠీలతో దాడి చేయడం అత్యంత బాధాకరమని జగన్ పేర్కొన్నారు. కేవలం ప్రచార విన్యాసాలు, ఘటన జరిగిన తర్వాత రొటీన్ సమీక్షలకే ప్రభుత్వం పరిమితమవుతోందని, జవాబుదారీతనం అన్నదే కనిపించడం లేదని ఆరోపించారు. "2025 జనవరిలో తిరుపతి వైకుంఠ ఏకాదశి టోకెన్ల తొక్కిసలాటలో ఆరుగురు, ఏప్రిల్‌లో సింహాచలంలో గోడ కూలి ఏడుగురు, నవంబర్‌లో కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాటలో తొమ్మిది మంది భక్తులు మరణించారు. ఈ ఘటనల తర్వాత కూడా ప్రభుత్వం గుణపాఠం నేర్చుకోలేదు. తిరుమల లడ్డూ వంటి పవిత్రమైన అంశాలను రాజకీయాల్లోకి లాగి కోట్లాది భక్తుల మనోభావాలను దెబ్బతీశారు. ఇప్పుడు ఈ నీచ రాజకీయాలు రాష్ట్రంలోని అన్ని ఆలయాలకూ వ్యాపిస్తున్నాయి" అని జగన్ విమర్శించారు. సనాతన ధర్మం గురించి పదేపదే మాట్లాడే చంద్రబాబు, పవన్ కల్యాణ్.. భక్తులపై లాఠీ దెబ్బలు పడుతుంటే ఎందుకు మౌనం వహిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ ఘటనకు బాధ్యత వహించి, భక్తులకు క్షమాపణ చెప్పాలని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని జగన్ డిమాండ్ చేశారు.

# మరో వందేభారత్

**ఆంధ్రప్రదేశ్, నవతరం**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో మంగళవారం సమావేశమయ్యారు. రాష్ట్రంలో రైల్వే వ్యవస్థను సమూలంగా బలోపేతం చేసే లక్ష్యంతో పలు కీలక ప్రాజెక్టులు, కొత్త సర్వీసులు, మౌలిక వసతుల కల్పనపై ఆయనతో చర్చించారు. ఈ మేరకు సమగ్రమైన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. విజయవాడ–బెంగళూరు మధ్య తిరుపతి మీదుగా వెళ్లేలా వందేభారత్ రైలును కేటాయించాలని కోరారు. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–చెన్నై, చెన్నై–బెంగళూరు హైస్పీడ్ రైల్ కారిడార్లను ఏపీని తాకుతూ ప్రకటించడంపై చంద్రబాబు కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. ఇదే సమయంలో, బెంగళూరు–చెన్నై హైస్పీడ్ రైలు మార్గాన్ని ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన తిరుపతికి అనుసంధానం చేయాలని ప్రత్యేకంగా కోరారు. విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేసిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలను వచ్చే ఏప్రిల్ 1వ తేదీ నుంచే ప్రారంభించేలా తక్షణమే గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే సరకు రవాణా వ్యవస్థను మెరుగుపరచాలని కోరారు. తాడిపత్రి నుంచి ముంబై జేఎన్‌పీటీ పోర్టుకు అరటిపండ్ల ఎగుమతికి వీలుగా, 50 శాతం రాయితీపై ఖాళీ రీఫర్ కంటైనర్లను కేటాయించాలని కోరారు. అలాగే ఉత్తర–దక్షిణ భారతాలను కలిపే ఇటార్సీ–విజయవాడ ప్రత్యేక సరకు రవాణా కారిడార్‌కు, ఏపీలోని పోర్టులను అనుసంధానిస్తూ విజయవాడ మీదుగా ఖరగ్‌పూర్–చెన్నై మధ్య ఈస్ట్ కోస్ట్ ఫ్రైట్ కారిడార్ ఏర్పాటుకు సహకరించాలని ప్రతిపాదించారు. రాయలసీమ సహా గిరిజన ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీని పెంచేందుకు కొత్త రైల్వే మార్గాల ప్రతిపాదనలను ఆమోదించాలని కోరారు. హైదరాబాద్–శ్రీశైలం–మార్కాపురం మధ్య కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేయడం ద్వారా శ్రీశైలం మహాక్షేత్రానికి భక్తులు సులభంగా చేరుకునే అవకాశం కలుగుతుందని వివరించారు. విజయవాడ, విశాఖ, తిరుపతి, అమరావతిలలో గ్రీన్ ఫీల్డ్ మెగా కోచింగ్ టెర్మినళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ–బెంగళూరు మధ్య తిరుపతి మీదుగా వందేభారత్ సర్వీసును నడపాలని చంద్రబాబు కోరారు. విశాఖ–విజయవాడ మధ్య హైస్పీడ్, విజయవాడ–కర్నూలు మధ్య సెమీ హైస్పీడ్, తిరుపతి–చిత్తూరు మధ్య హైస్పీడ్ లింక్ కారిడార్లను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కుప్పంలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వడంతో పాటు, అక్కడ రైలు బోగీల నిర్వహణ టెర్మినల్ ఏర్పాటు చేయాలని కూడా రైల్వే మంత్రిని కోరారు. సీఎం వినతులపై మంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

**ఢిల్లీలో చంద్రబాబు ఫుల్ బిజీ!** సీఎం చంద్రబాబు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలపై కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని కోరుతూ ఆయన తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, ఉక్కు శాఖా మంత్రి హెచ్‌డీ కుమారస్వామితో వేర్వేరుగా భేటీ అయ్యారు. మనోహర్ లాల్ ఖట్టర్‌తో సమావేశమైన చంద్రబాబు, రాష్ట్రంలో అమలు చేస్తున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల పురోగతిని ఆయనకు వివరించారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా రాష్ట్రంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు, వ్యర్థాల నిర్వహణకు (వేస్ట్ మేనేజ్‌మెంట్) ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాష్ట్రాన్ని 'జీరో ల్యాండ్ ఫిల్ స్టేట్'గా మార్చేందుకు తీసుకుంటున్న చర్యలను ఖట్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్వచ్ఛ భారత్ మిషన్ (అర్బన్) 2.0 కింద రూ. 276 కోట్ల అంచనా వ్యయంతో ఈ కార్యక్రమానికి కార్యాచరణ రూపొందించామని, ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ. 105 కోట్లను వెంటనే మంజూరు చేయాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఉక్కు శాఖా మంత్రి హెచ్‌డీ కుమారస్వామితోనూ సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, వైజాగ్ స్టీల్ ప్లాంట్ (ఆర్ఐఎన్ఎల్) తిరిగి లాభాల బాట పట్టడంపై కేంద్ర ప్రభుత్వానికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం అందించిన ఆర్థిక చేయూత, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మద్దతు, అలాగే స్టీల్ ప్లాంట్ కార్మికులు, ఉద్యోగుల అవిరళ కృషితోనే ఇది సాధ్యమైందని కుమారస్వామికి వివరించారు. ప్రస్తుతం వైజాగ్ స్టీల్ ప్లాంట్ లాభాలు సాధించడమే కాకుండా, పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో పనిచేస్తోందని ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఆర్ఐఎన్ఎల్ విషయంలో భవిష్యత్తులో కూడా కేంద్ర ప్రభుత్వం ఇదే రకమైన తోడ్పాటును, సహకారాన్ని కొనసాగించాలని కోరారు. ఈ భేటీల ద్వారా రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధులు, సహకారాన్ని సాధించేందుకు చంద్రబాబు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

# వ్యవసాయాన్ని మరో స్థాయికి తీసుకెళతాం





పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో మంగళవారం సమావేశమయ్యారు. ఈ భేటీ చాలా ఫలప్రదంగా జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశం అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. "దేశ వ్యవసాయ జీడీపీలో ఆంధ్రప్రదేశ్ వాటా 9.9 శాతంగా ఉంది. దీనిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్రమంత్రి సలహాలు, సూచనలు కోరాను. మా విజ్ఞప్తి మేరకు, రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ఒక యాక్షన్ ప్లాన్, వాల్యూ–ఎడిషన్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని శివరాజ్ సింగ్ తన శాఖ అధికారులను ఆదేశించారు" అని వెల్లడించారు. త్వరలో కేంద్ర బడ్జెట్ రానున్న నేపథ్యంలోనే అన్ని శాఖల మంత్రులతో సమావేశమవుతున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంపై కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కూడా స్పందించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి అభినందనలు తెలిపారు. దేశ వ్యవసాయ రంగంలో ఏపీ వాటా దాదాపు 10 శాతం ఉందని ప్రశంసించారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం హార్టికల్చర్ హబ్‌గా ఎదుగుతోందని, బడ్జెట్‌లో ప్రకటించిన పథకాలను వేగంగా అమలు చేస్తోందని కొనియాడారు. ఈ భేటీపై సీఎంవో కూడా ప్రకటన చేసింది. అందులో పేర్కొన్న మేరకు... రాష్ట్రంలో వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై చంద్రబాబు కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో చర్చించారు. సేంద్రీయ సాగుపై ప్రత్యేక దృష్టి సారించామని, 2024–25 సంవత్సరంలో సాగులో రసాయనాల వినియోగం 2.28 శాతం మేర తగ్గించామని చంద్రబాబు ఆయనకు తెలిపారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించినందున గ్రీన్ క్రెడిట్ ప్రోత్సాహకాలను ఇవ్వాలని కోరారు. కొబ్బరి సాగు అభివృద్ధి చేయడానికి రూ. 200 కోట్ల మేర సాయం చేయాలని, కోకోనట్ ప్రాసెసింగ్ పార్క్ ఏర్పాటు, కర్ణాటక తరహాలో మోడ్రన్ టెండర్ కోకోనట్ మార్కెట్ల ఏర్పాటు, కొబ్బరి రైతులకు ఆధునాతన పద్ధతులపై ట్రైనింగ్, నర్సరీల విస్తరణకు సహకరించాలని అన్నారు. పర్ డ్రాప్ మోర్ క్రాప్ పథకం పెండింగ్ లో ఉన్న రూ.695 కోట్లు విడుదల చేయాలని, ప్రైస్ డెఫిషియన్సీ పేమెంట్ సిస్టం కింద 2025–26 సీజన్‌లో తోతాపూరి మామిడికి కేంద్ర వాటాగా ఇవ్వాల్సిన రూ.100 కోట్ల సాయాన్ని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపీలో మఖానా డెవలప్ మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని, కొల్లేరు సరస్సు ప్రాంతంలో 50 వేల ఎకరాల్లో మఖానా సాగుకు అనుకూల వాతావరణం ఉన్నందున ప్రోత్సాహకాలు ఇవ్వాలని కోరారు.

## ఆంధ్ర రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ:: అమలాపురం డిపో



( నవతరం - అమలాపురం) శివరాత్రికి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఫిబ్రవరి నెల 13,14, మరియు 15 తేదీలలో శ్రీశైలం కు ఉదయం 9.30, సాయంత్రం 5.30,6.15,6.45 గం.లకు మరియు రాత్రి 7.00 గం.లకు ప్రత్యేక సర్వీసులు ఆపరేట్ చేస్తామని, వీటికి అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కలదనీ, ప్రయాణీకులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని అమలాపురం డిపో మేనేజర్ ఋచీ శర్మ తెల్పినారు. అంతేకాకుండా శివరాత్రి సందర్భంగా ఈ నెల 15,16 తేదీలలో ఉదయం 5.00 గం.ల నుండి రాత్రి 7.00 గం.ల వరకు ప్రతీ గంటకు కుండలేశ్వరానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని తెలియజేశారు.

## ప్రజా వేదిక ద్వారా ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం




(నవతరం - మంగళగిరి) మంగళగిరి: సామాన్య ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి తక్షణ పరిష్కారం చూపాలనే లక్ష్యంతో మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా వేదిక' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం గారు పాల్గొని బాధితుల నుంచి వినతులు స్వీకరించారు.ప్రజల కష్టాలు తీర్చడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సమస్యలను కేవలం వినడమే కాకుండా పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం తమ బాధ్యత అని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. మంగళగిరి నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది ప్రజలు హాజరై తమ వ్యక్తిగత, భూసంబంధ, సామాజిక సమస్యలను వివరించారు.వినతులు స్వీకరించి అర్జీలను సంబంధింత అధికారులకు పంపించి తక్షణ పరిష్కారాణికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సాధ్యం కాని క్లిష్ట సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి దృష్టికి తీసుకెళ్లి, సానుకూల పరిష్కారం లభించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వం,పార్టీ అందుబాటులోనే ఉన్నాయనే నమ్మకం కలుగుతోందని, ప్రజా సమస్యల పరిష్కారంలో ఇలాంటి వేదికలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు.

## బెస్ట్ స్టూడెంట్ అవార్డు అందుకున్న బాల ఇంద్రజాలికుడు రుషిత్




(నవతరం - ఆత్రేయపురం ) డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన వండర్ కిడ్ బళ్ళ రుషిత్ అమెరికాకు చెందిన సిర్డ్స్ సంస్థ తిరుపతి నిర్వాహకుడు ఎమ్. హేమ శేఖర్ ఆధ్వర్యంలో తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన బ్యాక్ టు స్కూల్ అనే కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ఐఐటి ప్రొఫెసర్ టి నర్సింగరావు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ చైర్మన్ అనిమిని రవి నాయుడు చేతుల మీదుగా బెస్ట్ స్టూడెంట్ అవార్డు అందుకున్నాడు. అతి చిన్న వయసులోనే మ్యాజిక్ రంగంలో ప్రపంచ రికార్డులను సృష్టించి తన మ్యాజిక్ కళ ద్వారా సమాజ చైతన్యాన్ని చేస్తున్నందుకు ఈ అవార్డును అందుకున్నట్లు రుషిత్ గురువు, తాత ఆయన డాక్టర్ శ్యామ్ జాదూగర్ తెలిపారు. ఈ సందర్భంగా రుషిత్ ను పలువురు అభినందించారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట వరం...



(నవతరం - రాజమహేంద్రవరం రూరల్ ) స్థానిక గాంధీపురంలో ఉన్న రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి నివాసంలో 23 మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 11 లక్షల 42 వేల 916 రూపాయల చెక్కులను, 7 లక్షల విలువైన రెండు ఎలఓసిలు అందచేసారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు సిఎం సహాయ నిధి ద్వారా ఇతోధికంగా సహాయం అందుతోందన్నారు. పేదలకు, మధ్య తరగతి కుటుంబాలను ఆదుకునేందుకు తమ వంతు బాధ్యతగా పారదర్శకంగా లబ్ధిదారులను గుర్తించి వాటికి అవసరమైన అన్ని పత్రాలతో తమ కార్యాలయం ద్వారానే సిఎం రిలీఫ్ ఫండ్‌కు పంపుతున్నామన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా వర్తించని వాటికి ఈ సహాయం అందిస్తున్నామన్నారు. అయితే ఆరోగ్యశ్రీ సేవలను మరింతగా విస్తరించాల్సి ఉందని, దీనిపై అసెంబ్లీలో ప్రభుత్వం దష్టికి తీసుకుని వెళతామన్నారు. కొన్ని ఆసుపత్రుల్లో అవసరమైన వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. కార్యక్రమంలో ఎ.ఎం.సి చైర్మన్ మార్ని వాసుదేవ్, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, రూరల్ టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, కడియం మండల తెదేపా అధ్యక్షులు వెలుగుబంటి రఘురాం, రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్లు పందూరి అప్పారావు, దాలిపర్తి వేమన, పిన్నమరెడ్డి ఈశ్వరుడు, నున్న కృష్ణ, కూరుకురి కిషోర్, మట్టా శ్రీను, నిమ్మలపూడి రామకృష్ణ, దుద్దుపూడి రమేష్, ఏడాకుల వెంకటేశ్వరరావు, చలమూరి సత్యనారాయణ, కుంచే హనుమంతరావు, సింగవరపు సత్యనారాయణ, పుక్కళ్ళ రాజు, గుర్రపు సత్యనారాయణ, తూము శ్రీను, ముమ్మిడి దేవీ నాగేశ్వరరావు, సురపురెడ్డి భరత్, బత్తుల వాసు, గోరు నాగేశ్వరరావు, దొంతంశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు

# విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుండి 'స్మార్ట్ మీటర్స్ పఖ్వాడా'

(నవతరం - అమలాపురం) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, ఆంధ్రప్రదేశ్ ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఏపీ ఈపీడీసీఎల్) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ సర్కిల్ ఆధ్వర్యంలో, భారత ప్రభుత్వం విద్యుత్ మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల మేరకు ఈనెల 9 నుండి 23వ తేదీ వరకు "స్మార్ట్ మీటర్స్ పఖ్వాడా" కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు విద్యుత్ లిసూపరింటెండింగ్ ఇంజనీర్ బి. రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులకు ఆధునిక సాంకేతిక సేవలు అందించడం, విద్యుత్ వినియోగంపై అవగాహన పెంపొందించడం మరియు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల వినియోగాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. స్మార్ట్ మీటర్ల ద్వారా వినియోగదారులు ముందస్తుగా విద్యుత్ చెల్లింపులు చేసుకునే సౌకర్యం, రియల్ టైమ్‌లో విద్యుత్ వినియోగ వివరాలు తెలుసుకునే అవకాశం, ఖచ్చితమైన బిల్లింగ్ విధానం ఉంటుందన్నారు. తక్కువ బ్యాలెన్స్ మరియు అసాధారణ వినియోగంపై హెచ్చరికలు పొందే సదుపాయం కూడా లభిస్తుందని పేర్కొన్నారు. అలాగే మొబైల్ యాప్ ద్వారా వినియోగ వివరాలు తెలుసుకోవడం మరియు రీఛార్జ్ సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుందని తెలిపారు. "స్మార్ట్ మీటర్స్ పఖ్వాడా" కార్యక్రమాల సందర్భంగా అవగాహన ప్రచారం, వినియోగదారుల మొబైల్ ఫోన్లలో యాప్ ఇన్‌స్టాలేషన్ సహాయం, స్మార్ట్ మీటర్ల వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శనలు, సహాయక కేంద్రాల ఏర్పాటు, గ్రామ మరియు మున్సిపల్ స్థాయిలో అవగాహన సమావేశాలు నిర్వహించబడతాయని ఆయన తెలిపారు. జిల్లా పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని స్మార్ట్ మీటర్ల వినియోగంపై అవగాహన పెంపొందించుకోవాలని మరియు స్మార్ట్ మీటర్ అమరిక సమయంలో విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఎస్ ఈ గారు విజ్ఞప్తి చేశారు.

# పల్లెల రూపురేఖలు మార్చడానికి కూటమి ప్రభుత్వం విశేష కృషి

- గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపడేలా నిరంతర చర్యలు.
- కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.



( నవతరం -కొత్తపేట) కొత్తపేట మండలంలో రూ.3 కోట్ల 57 లక్షల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు, రూ.1 కోటి 80 లక్షలతో వెల్నెస్ సెంటర్ల నిర్మాణానికి, మొత్తం రూ. 5 కోట్ల 37 లక్షలతో చేపట్టిన పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పల్లెల రూపురేఖలు సమూలంగా మార్చడానికి, గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపడేలా నిరంతర చర్యలు చేపడుతున్నామని ఆయన అన్నారు. కొత్తపేట మండలంలోని పలు గ్రామాల్లో మొత్తం రూ.5 కోట్ల 37 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శంకుస్థాపనలు నిర్వహించారు. ఇందులో రూ.3 కోట్ల 57 లక్షలతో సీసీ రహదారులు, డ్రెయిన్లు తదితర మౌలిక వసతుల అభివృద్ధి పనులకు, రూ.1 కోట్ల 80 లక్షలతో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వెల్నెస్ సెంటర్ల నిర్మాణాలకు శంకుస్థాపన నిర్వహించారు. వాడపాలెంలో రూ.35 లక్షలతో ఆర్ అండ్ బి రహదారి, పలు సీసీ రోడ్లు డ్రైన్లు నిర్మాణానికి ఎమ్మెల్యే శంఖుస్థాపన చేశారు. కొత్తపేట గ్రామపంచాయతీ పరిధిలో వాడపాలెం పెదపేట వద్ద ఎమ్జీఎన్ఆర్జీఎస్ నిధులు రూ.55 లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కొత్తపేట శివారు బండారు పేటలో రూ.36 లక్షలతో నిర్మించనున్న గ్రామీణ ఆరోగ్య ఉప కేంద్రానికి శంకుస్థాపన చేశారు. కొత్తపేట గ్రామపంచాయతీ పరిధిలో బీసీ కమ్యూనిటీ హాల్, తదితర ప్రాంతాల్లో ఎమ్జీఎన్ఆర్జీఎస్ నిధులు రూ.42 లక్షలతో చేపట్టిన పలు సిసి రోడ్లు డ్రైన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మందపల్లిలో రూ.36 లక్షలతో నిర్మించనున్న గ్రామీణ ఆరోగ్య ఉప కేంద్రానికి శంకుస్థాపన చేశారు. పలివెల గ్రామపంచాయతీ పరిధిలో పలు ప్రాంతాల్లో ఎమ్జీఎన్ఆర్జీఎస్ నిధులు రూ.75 లక్షలతో చేపట్టిన పలు సిసి రోడ్లు డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గంటి గ్రామపంచాయతీ పరిధిలో రూ.30 లక్షల ఎమ్జీఎన్ఆర్జీఎస్ నిధులతో చేపట్టిన సిసి రోడ్లు డ్రైన్ల నిర్మాణానికి, రూ.36 లక్షలతో నిర్మించనున్న విలేజ్ హెల్త్ క్లినిక్ కు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఆవిడిలో రూ.50 లక్షల ఎమ్జీఎన్ఆర్జీఎస్ నిధులతో చేపట్టిన రహదారి నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. బిల్లకుర్రులో రూ.70 ఎమ్జీఎన్ఆర్జీఎస్ నిధులతో చేపట్టిన సిసి రహదారి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. వానపల్లిలో రూ.72 లక్షలతో నిర్మించనున్న 2 విలేజ్ హెల్త్ క్లినిక్ లకు శంకుస్థాపన నిర్వహించారు. ఈ అభివృద్ధి పనుల ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మరింత బలోపేతం కావడంతో పాటు ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని, ఆరోగ్య సేవలు చేరువవుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.




## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్ సదస్సు




(నవతరం- రావులపాలెం ) రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జేకేసీ) కోఆర్డినేటర్ కె. రజిని ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. శ్రీనివాసరావు అధ్యక్షతన కెరీర్ గైడెన్స్, పోటీ పరీక్షలు అనే అంశంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంఘమిత్ర స్టడీ సర్కిల్ అమలాపురం డైరెక్టర్ సి.హెచ్.ఎస్. ప్రసాద్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుత సమాజంలో ఉద్యోగ సాధనలో పోటీ తీవ్రంగా ఉన్న నేపథ్యంలో స్పష్టమైన లక్ష్యం ప్రణాళికతో కూడిన చదువు అత్యవసరమని ఆయన తెలిపారు. ఏ ఉద్యోగాన్ని లక్ష్యంగా పెట్టుకున్నా ముందస్తు ప్రణాళిక చాలా అవసరమని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ), బ్యాంక్, రైల్వే, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్సెస్సీ), సబ్ ఇన్‌స్పెక్టర్, పోలీస్ కానిస్టేబుల్, డీఎస్సీ వంటి పోటీ పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలి, చదువు విధానం, సమయ నిర్వహణ, సిలబస్ రూపకల్పన తదితర అంశాలపై విద్యార్థులకు విపులంగా వివరించారు. డిగ్రీ పూర్తయ్యాక అందుబాటులో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగ అవకాశాలు, వాటిని సాధించే మార్గాలు, కెరీర్‌ను అభివృద్ధి దిశగా ఎలా మలుచుకోవాలి అనే విషయాలపై కూడా అవగాహన కల్పించారు. విద్యార్థులు పట్టుదలతో కృషి చేసి ఉన్నత పదవులు సాధించి, సమాజానికి సేవ చేసే ఆదర్శ పౌరులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్ కుమార్, అధ్యాపకులు సుభాషిని, సుందర రామిరెడ్డి, యువరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.



# పర్యాటక రంగ అభివృద్ధికి అందుబాటులో ఉన్న అవకాశాల సద్వినియోగం చేసుకోవాలి






(నవతరం - రాజమహేంద్రవరం) తూర్పు గోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం, కొవ్వూరు పరిధిలో గోదావరి నది తీర ప్రాంతాలు, హౌస్ బోటింగ్, కడియం నర్సరీ ఆధారిత పర్యాటక అభివృద్ధికి సంబంధించి ప్రతిపాదిత ప్రాజెక్టు పనులను పూర్తి స్థాయిలో ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో పర్యాటక, సాంస్కృతిక శాఖ అధికారులతో పాటు బోట్ వెండర్స్, హౌస్ బోటింగ్ ఆపరేటర్లు, ఎకో స్పోర్ట్స్ నిర్వాహకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో పర్యాటక రంగ అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని రాబోయే మూడు నెలల్లో పర్యాటకులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. హౌస్ బోటింగ్, జల క్రీడల కార్యకలాపాలకు సంబంధించిన బోటు డ్రైవర్లకు నైపుణ్య శిక్షణ, ధృవీకరణ, లైసెన్సింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఇందుకు అవసరమైన అన్ని అనుమతులను జిల్లా యంత్రాంగం తరపున సమన్వయంతో పూర్తి చేస్తామని వెల్లడించారు. పర్యాటక రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక వనరులను తప్పనిసరిగా వినియోగంలోకి తీసుకురావాలని, అనుమతుల కోసం కాలయాపన చేయకుండా పనులు క్షేత్రస్థాయిలో ముందుకు సాగాలని కలెక్టర్ ఆదేశించారు. హౌస్ బోట్స్ తయారు చేసే మరింత మంది తయారీదారులను గుర్తించి, వారి ద్వారా నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రాంతంలో సరైన నిర్వహణ, భద్రతా ప్రమాణాలు, మెరుగైన సేవలు అందించగలిగితే ప్రభుత్వం తరపున పర్యాటక ప్రచార కార్యక్రమాలకు పూర్తి స్థాయిలో ముందుంటామని స్పష్టం చేశారు. సమీక్షా సమావేశాలు నిర్వహించడం మాత్రమే కాకుండా అవి ఫలవంతంగా మారేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడం ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. వారం రోజుల్లో పురోగతిపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కడియం నర్సరీ ప్రాంతంలో చేపడుతున్న పర్యాటక ప్రాంతాల అభివృద్ధి పనులలో భాగంగా డ్రైనేజీల ద్వారా చెరువుల్లోకి మురుగు నీరు చేరకుండా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు టూరిజం శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, పరిస్థితిని సమగ్రంగా అంచనా వేసి తగిన సాంకేతిక చర్యలు వెంటనే తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. ఈ సమావేశంలో రీజినల్ డైరెక్టర్ ఎన్.వి.వి.ఎస్. మూర్తి, జిల్లా టూరిజం అధికారి పి. వెంకటాచలం, డివిఎం పవన్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ భాస్కర్ రెడ్డి, బోట్ వెండర్స్, హౌస్ బోటింగ్ ఆపరేటర్లు, ఎకో స్పోర్ట్స్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# నిడదవోలు సర్వతోముఖాభివృద్ధే ధ్యేయం: మంత్రి కందుల దుర్గేష్

**విజ్జేశ్వరంలో విస్తృతంగా పర్యటించి పల్లె పండుగ ద్వారా నిర్మిస్తోన్న రోడ్లు, డ్రెయిన్లు సహా పలు అభివృద్ధి పనుల పరిశీలన**

**18 నెలల కాలంలో విజ్జేశ్వరం గ్రామంలో రూ. 60 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టామని వెల్లడి**

**కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో హర్షాతిరేకాలు వెల్లువెత్తడంపై ఆనందం వ్యక్తం చేసిన మంత్రి దుర్గేష్**



(నవతరం - నిడదవోలు ) నిడదవోలు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన విజ్జేశ్వరం గ్రామంలో విస్తృతంగా పర్యటించి, అక్కడ జరుగుతున్న పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలోని వీధివీధిన పర్యటించిన మంత్రి దుర్గేష్ కి ప్రజలు ఘనస్వాగతం పలికారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న డొంక రోడ్లను నిర్మించి తమ కలను నిజం చేసినందుకు గ్రామస్థులు మంత్రి దుర్గేష్ కి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి దుర్గేష్ స్వయంగా డొంక రోడ్లపై కాలినడకన పర్యటించి, పనుల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారులతో ముచ్చటించి వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమర్థ పరిపాలన, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో విజ్జేశ్వరంలో రికార్డు స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. స్థానికంగా పల్లె పండుగ 1.0 కింద రూ. 15 లక్షలతో సీసీ రోడ్డు, రూ. 25 లక్షలతో డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం ఎస్సీ కాలనీలో రూ. 14 లక్షలు, బీసీ కాలనీలో రూ. 6 లక్షలతో సీసీ రోడ్ల పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. గడిచిన 18 నెలల్లోనే రూ. 60 లక్షలకు పైగా వ్యయంతో విజ్జేశ్వరంలో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. 2019-24 మధ్య కాలంలో గత ప్రభుత్వం రోడ్ల మీద తట్టెడు మట్టి కూడా వేయలేదని మంత్రి దుర్గేష్ విమర్శించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, కూటమి ప్రభుత్వం నాడు ఇచ్చిన మాట ప్రకారం నిడదవోలు నియోజకవర్గానికి శాస్కి స్కీమ్ కింద రూ. 29 కోట్లు, ఆర్ అండ్ బీ ద్వారా రూ. 31 కోట్లు మంజూరు చేయించి అభివృద్ధి పనులు పరుగులు పెట్టిస్తోందని తెలిపారు. గత ఐదేళ్ల చీకటి పాలనను వీడి, కూటమి ప్రభుత్వంలో నిడదవోలు వెలుగులు చూస్తోందన్నారు. దశాబ్దాల కాలంగా ఎదురుచూస్తున్న డొంక రోడ్లను పూర్తి చేసి ప్రజల కలను నిజం చేయడం ఎంతో తృప్తినిచ్చిందన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో అందిస్తూ కూటమి ప్రభుత్వం ప్రజల మెప్పు పొందుతోందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో స్థానిక కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## బీసీవై పార్టీ బీసీ సింహ గర్జన పోస్టర్ ఆవిష్కరణ



పోరుమామిళ్ల, ఫిబ్రవరి 10 (నవతరం): ఈ నెల 22వ తేదీన గుంటూరు నాగార్జున యూనివర్సిటీ ఎదురు ప్రాంగణంలో బీసీవై పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో జరగనున్న బీసీ సింహ గర్జన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిస్తూ, బద్వేల్ నియోజకవర్గం పోరుమామిళ్ల మండలంలో గోడ రాతల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీవై పార్టీ రాష్ట్ర నాయకులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ వేల్పుల రామ్మోహన్ యాదవ్, నక్క దినేష్ యాదవ్, రాష్ట్ర యూత్ కో-కన్వీనర్లు తిపిరిబోయిన రమేష్ యాదవ్, లీలా కృష్ణ యాదవ్, బద్వేల్ నియోజకవర్గ బీసీవై పార్టీ నాయకులు శివారపు నరసింహ యాదవ్, తిపిరిబోయిన చిన్న వెంగయ్య పాల్గొన్నారు. అదేవిధంగా వివిధ బీసీ కుల సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై బీసీ హక్కుల కోసం జరగనున్న ఈ మహా గర్జనకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బీసీల ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం జరగనున్న ఈ సింహ గర్జనకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.



## విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థితికి ఎదగాలి




కందుకూరు, ఫిబ్రవరి10 (నవతరం) విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థితికి ఎదగాలని కందుకూరు బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ మేనేజర్ ఎస్ మహేంద్ర కుమార్ అన్నారు. మంగళవారం కందుకూరు పట్టణంలో బ్రాహ్మణ పాలెం నందు ఉన్న ప్రాథమిక పాఠశాలలో బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సి ఎస్ ఆర్ ఫ్రెండ్స్ కింద విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, వాటర్ బాటిల్స్ అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ మహేంద్ర కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థితికి ఎదగాలని అన్నారు. విద్య ఒక్కటే జీవితాన్ని మార్చేస్తుందని అన్నారు. తమ బ్యాంకు సి ఎస్ ఆర్ నిధుల ద్వారా విద్యార్థులకు సేవ చేయడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్స్ కే అనిల్ కుమార్, జి.అనిల్ కుమార్, బ్యాంకు సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి పర్వదినాన అన్నదానాల టెంట్లకు అనుమతి తప్పనిసరి



(నవతరం- రాజమహేంద్రవరం) మహాశివరాత్రి పర్వదినం రోజున ప్రధాన, ఇతర రహదారులపై అన్నదాన కార్యక్రమాల కోసం దాతలు ఏర్పాటు చేసే టెంట్లకు.. ముందస్తుగా పోలీస్ శాఖ నుండి అనుమతి తప్పనిసరి అని కమిషనర్ రాహుల్ మీనా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అన్నసంతర్పణ కేంద్రాలను మ్యాప్‌లో సూచించిన ప్రాంతాల్లోనే ఏర్పాటు చేయాలని.. భోజనం కోసం ఉపయోగించిన ప్లేట్లు, గ్లాసులు, ఇతర వ్యర్థాలను కచ్చితంగా డస్ట్ బిన్ లలోనే వేయవలసిందిగా పేర్కొన్నారు. తద్వారా తిన్న ప్లేట్లు రోడ్ల ప్రక్కన, సైడ్ కాల్వలలో పడవేయకుండా.. ఆ ప్రాంతంలో పారిశుద్ధ్యాన్ని కాపాడిన వారవుతామని చెప్పారు. అలాగే మ్యాప్‌లో సూచించిన మార్గాలు (మార్గదర్శక పాయింట్లు), నో వెహికల్ జోన్లు, నో పార్కింగ్ జోన్లు వంటి అన్ని నియమాలను భక్తులు కచ్చితంగా పాటించాలన్నారు. కావున నగర పరిశుభ్రత కోసం ప్రభుత్వంతో సహకరించి.. క్లీన్ రాజమహేంద్రవరం నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

Printed by SIRIGIRI VARADARAJU and Published by SIRIGIRI VARADARAJU on behalf of SIRIGIRI VARADARAJU,and Printed at: Kanthi Publications, Door No:2-504/1,Adityanagar colony,Arasavalli, Srikakulam, Andhra Pradesh State,532401, India,Printed and Published and Owned by SIRIGIRI VARADARAJU Door No:18-11-12/1,Krishnanagar, Rajamahendravaram,East Godavari